### కథానిక

# పలాయనం

ఆర్. యం. చిదంబరం

గార్డు విజిలూది పచ్చజెండా చూపెట్టాడు.

ఇంజనుదగ్గర్నుంచి పెట్టెల్ని వెతుక్కుంటూ వస్తున్న గోపాలం ఆఖరికంపార్టుమెంటు ఖాళీగా వుండటంచూసి కొండెక్కినంత సంతోషించి ముందు అక్కడికే రాక వృథాగా తిరిగినందుకు తననితాను తిట్టుకున్నాడు. ట్రంకు లోపలికి తోసి బండెక్కాడు. బలవంతాన దెబ్బలకు భయపడి పాఠం చదువుతున్న సోమరిపోతులా బండి కదిలింది. ప్లాట్‌ఫారం వెనక్కి జరిగి పోయింది.

ట్రంకు కాళ్ళదగ్గర పెట్టుకుని కిటికీదగ్గర కూర్చుని తృప్తిగా నిట్టూర్చి ఓసారి కంపార్టుమెంటంతా కలయచూశాడు. ఆ మూల ఓ ముసలాడు తాటిచెట్టంతలావు చుట్టకాలుస్తూ పెద్ద గోళెంలావున్న తలపాగను మోయలేక కునికిపాట్లు పడుతున్నాడు. తనకెదురుగా ఎవరో కూర్చున్నారు. ఇంకెవ్వరూ లేరు. తనకెదురుగా వున్నవాడు రెండుచేతులమధ్య ముఖాన్ని ముడుచుకుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎందుకో అతన్ని ఎగాదిగా చూశాడు గోపాలం. గుండె జల్లుమంది.

అవును. అతనే- చాలా మారిపోయాడు. యువకత్వం నశించకపోయినా తెల్లవెంట్రుకలు, అతుకుల బట్టలు, సంస్కారంమీద శీతకన్నువేసిన జుట్టు...గోపాలానికి ఐదునిమిషాలవరకూ 'అతనేనా?'అని అనుమానంగానే వుంది.

"ఏరోయ్! బుచ్చి! బాగున్నావా?"అన్నాడు ధైర్యంచేసి.

శిథిలసౌధంలా అతనెదురుగా కనిపిస్తుంటే 'బాగున్నావా'అనడగటం బాగాలేదనుకున్నాడు. బుచ్చి తలెత్తి ఓక్షణంచూసి అన్నాడు:

"ఓ...గోపాలం! ఎక్కడికెళుతున్నావు? చాలాకాలమైంది మనం కలుసుకుని. బాగున్నావా?" నవ్వటానికి యత్నించాడు కాని పెదిమలు బిగుసుకుపోయాయి. గోపాలానికి అతన్ని చూస్తుంటే భయంకూడా మొలకెత్తింది.

"ఏదో ఇలావున్నానుకాని నువ్విలా మారిపోయావేమిట్రా? కొంపతీసి ఏ దేవుడీసాక్షాత్కారం కోసమైనా తపస్సు చేయలేదుకదా!" అనడిగాడు. బుచ్చితో సరదాగా మాట్లాడాలన్నది గోపాలం అభిప్రాయంకాదు. పుండుమీద కారంజల్లినట్టు తను పరుషంగా మాట్లాడితే ప్రమాదమనుకున్నాడు.

"నీ వూహ కొంతవరకూ రైటురా...సమాధిలోకి పోవటానికే ఇదంతా."

అతనిమాటల్లో తాత్పర్యం గోపాలానికర్థం కాలేదు. ఆశావాదాన్ని మాత్రం వదులుకోలేదు.

"నాకు బతుకుమీద ఆశ నశించిందిరా- ఎక్కడికెళ్ళినా ఎదురుగాలులంటే నమ్ము. విసుగెత్తిపోయాను. చచ్చిపోతే బాగుండును. నన్ను చూస్తే నీకేమీ అర్థమవటంలేదూ?" అని పక్కనున్న తుప్పట్టిన ట్రంకుమీద బరువుగా చెయ్యివేశాడు. జీవితంమీద దారుణమైన విప్లవం అతని కళ్ళల్లో కనుపించింది.

"అదేమిట్రా! ఎవరికిమాత్రం ఆశవుండదు? నేను నవ్వుతున్నానంటే నిజంగా నవ్వుతున్నాననుకున్నావా? లోపల ఎంత మదనపడుతున్నానో! అదంతా పైపైకే పెసిమిజాన్ని తోడుకున్నావే! కాని నువ్వు వటి ఎస్కేపిస్టువిరా! ఆ మాట మొదటినుంచీ రుజువుచేసుకుంటున్నావు. ఇంతకీ ఎక్కడకెళుతున్నావు ఏంచేస్తున్నావు?" అని ఉపన్యాసధోరణిలో సాగించాడు.

"ఈ ట్రంకునిండా స్త్రీల ఫోటోలు-ఫ్యాసినిమా సాంగ్సు-దండకాలు-చాకలి పద్దు పుస్తకాలు-అప్‌టుడేట్ నావల్సులున్నాయి. దీన్ని బట్టి నా వృత్తేమిటో ఆలోచించుకో" అనేసి అస్తమిస్తున్న సూర్యుడిలాగ నవ్వాడు బుచ్చి. గోపాలం అర్థమైనట్టు తలాడించాడు.

ఐదునిమిషాలు నిశ్శబ్దం నెలకొంది. హృదయంలో తుపానుగాలుల్లాగ కోటి ఆందోళనలున్నాయి. అవన్నీ వెళ్ళగక్కి బుచ్చిని దులిపేసి సంస్కరించాలి. అతను కాంతానికి చేసిన మహాద్రోహాన్ని నిరూపించాలనుకున్నాడు. కాని ప్రారంభించటం ఎలాగ? కిటికీలోంచి బయటికి చూశాడు. వంగిన టెలిగ్రాఫు తీగలు గబగబా వెనక్కి పరుగెడుతున్నాయ్. దూరంగా సన్నటి కాలవలో చిన్నచిన్న పడవలు కనిపిస్తున్నాయి.

"బాబూ! టైం ఎంతవుంది?" అడిగాడు ముసలాడు.

గోపాలం వాచీచూసి "ఐదు" అన్నాడు. ముసలాడు ఏదో గొణుక్కున్నాడు. బుచ్చి మాత్రం హరిశ్చంద్రుడిని మించిన సత్యసంధతతో ధీమాగా కూర్చున్నాడు.

"అయితే బుచ్చీ! నువ్వు పెళ్ళిచేసుకున్నది ఇందుకేనా?" కొంచెం ముందుకు వంగి నెమ్మదిగా అడిగాడు.

బుచ్చి విచిత్రంగా చూశాడు. మాట్లాడలేదు.

"పెళ్ళాన్నొదిలేసి మూడేళ్ళయింది కదా! నువ్వు వున్నావో లేదో తెలియని స్థితిలో వాళ్ళని వదిలేయటం నీకేమన్నా బావుందా? బుద్ధిమంతుడి వనుకున్నాను కాని ఇంతటి ఎస్కేపిస్టు వనుకోలేదు. పోనీ-నీ పిల్లను చూసుకోటానికి రావచ్చా? ఇష్టంలేనివాడివి ఎందుకు పెళ్ళి చేసుకున్నావు? పాపం-అదెంత బాధ పడుతోందో ఆలోచించావా? అది ఏమయ్యో గొయ్యో చూసుకుంటే? ఛీ...ఛీ...నువ్వు నా స్నేహితుడి వనుకోటం మహా పాపం" పొంగి పొరలివస్తున్న వుద్రేకాన్నాపలేక పోతున్నాడు.

"గోపాలం! నువ్వేమైనా అంటావు. నా స్థితిలో వుంటే నీకు తెలిసొచ్చేది. నేను తిన్నగా సుఖంగా వుండగలిగితే దాన్ని తెచ్చుకోనంటావా? నా పొట్టకోసమే నానాయాతనలూ పడుతున్నాను. దాన్నికూడా చేతులారా మాడ్చి చంపనా?" అసహాయత కళ్ళల్లో ప్రదర్శిస్తూ అన్నాడు.

"అంటావు.. మాటలనటానికేం? ఇండియా అంతా టూరుకొట్టి వచ్చావుగా. ఆ మాత్రమన్నా అనకపోతే ఎందుకు? నిజాన్ని దాచలేవు సుమా. దొంగతనంకూడా చేశావట. చూస్తున్న మాకే కడుపు తరుక్కుపోతుంది. నీకు చీమకుట్టినట్టయినాలేదు. ఎలావుంటుంది? ఇలా ఎస్కేపిజం అలవర్చుకున్నావు. ఆ అమ్మాయి గొంతుక్కోశావు. ఏదో వాదిస్తావు. రోజుకు అర్థరూపాయిరాని రిక్షావాడు కాపరం చెయ్యటంలేదూ?" ఉద్రేకంలో మాటలుకూడా తిన్నగా వుచ్ఛరించలేక పోతున్నాడు.

"గోపాలం! ఊరుకుందూ! నీకుదండం పెడతాను. అవన్నీ ఎందుకిప్పుడు? అయిందేదో అయిపోయింది. నన్ను వేధించకు. తప్పేచేశాననుకో-పరిహారం చేసుకుంటాలే" అనేసి మొహం చేతుల్తో కప్పుకున్నాడు.

అతనితో మాట్లాడ్డానికే గోపాలాని కసహ్యమేసింది. ఇంతమంది ఏదోఒకవిధంగా బతకంగాలేంది వీడికేమొచ్చింది సంసారభారంనుంచి తప్పించుకుందామనే ఆలోచన? అంతా అలాగే అనుకుంటే ఇక ప్రపంచం దేనికి?...ప్రతివాడికీ జీవితంలో బాధలకు దూరంగా వుండాలనే వుంటుంది. తనకుమాత్రం లేదూ? అందుకని అందర్నీ వదులుకోగలుగుతున్నాడా?

ట్రంకులోంచి ఏదోనవల తీశాడు చదువుదామని. కాని సాగలేదు. అక్షరాలు అలుక్కుపోయినట్టు కనిపించాయ్. మూసేశాడు. ముందున్న బల్లకు కాళ్లు తన్నిపెట్టి వెనక్కి పరుగెత్తాడు...

* * *

కోమటి కొట్లో గుమాస్తాగా వుంటున్న కామయ్య ఇంటికాలస్యంగా వచ్చాడంటే కాంతం పెళ్ళివిషయమే కారణమైయుంటుంది. మేడమీద కిటికీదగ్గర కూర్చున్న గోపాలానికి కామయ్య ఇంటి పెరడు - అక్కడజరుగుతున్న రభసలు కనిపించేవి.

వెధవ... ధర్మఘోరం పోయింది కూడా... వంటలుచేసుకుని బతుకుతున్నాడు. వాడికీ కావాలిట అయిదువందలు.. మగాళ్ళంతా కట్నాలకోసమే పుట్టారు గాబోలు!"అని ఆవేళ చూసొచ్చినవాడిమీద విరుచుకు పడేవాడు. అస్తమానం ఇంట్లో గొడవలు. నెలకోసారైనా కామయ్య పెళ్ళాం పెరట్లో తులసిచెట్టు దగ్గర కూర్చుని భోరున ఏడ్చేది. ఇవన్నీ కాంతం ఎలాభరించు

గలుగుతోందా అని గోపాలం ఆశ్చర్యపోయేవాడు. బ్రహ్మ బంగారుపాత్రలో పడేస్తున్న మణుల్లోంచి పొరపాటున నేలమీదజారిపోయింది కాంతమనుకునేవాడు.

చివరికి కాంతాన్ని చూట్టానికి బుచ్చి వచ్చాడు. అతన్ని చూడగానే గోపాలానికి పోగొట్టుకున్న వస్తువు దొరికినట్లయింది. ఈసారి కామయ్య నెత్తిమీద గాడిద బరువు రూఢిగా పోతుందనుకున్నాడు.

పెళ్ళిచూపు లయ్యాక బుచ్చిమావయ్య "ఉత్తరం రాస్తాం" అనే ప్రతిపక్ష సమాధానం పారేశాడు. బుచ్చి వెళ్ళిపోతూ గోపాలందగ్గరికి వచ్చాడు.

"ఏరా! ఎలావుంది పిల్ల?"

"అంతా బాగానేవుంది కట్నం అట్టే ఇవ్వరట. మావయ్య కంతగా ఇష్టంలేదు. అమ్మాయి అందం వొక్కటే అనుకూలంగా వున్నది" అన్నాడు బుచ్చి.

"స్నేహితుడిగా చెబుతున్నా మనిద్దరం కలిసి చదువుకున్నాం. నా మాటను నమ్మాలి. కామయ్య కూతురు రత్నం అనుకో. కట్నంకోసం చూడకు. ఆ అమ్మాయిని చేసుకుంటే ఓ బీద కుటుంబాన్ని రక్షించినవాడవుతావు. వాళ్ళందర్నీ అగాధంలోంచి రక్షించావన్న మాట-నామాట వినితీరాలి.

"కాని నాకంటె స్థితిమంతుడివి. నువ్వే చేసుకోకూడదూ?" అని బుచ్చి ప్రశ్నించేసరికి గోపాలం అహం దెబ్బతింది. అతని ప్రశ్నలో పరిహాసాల నిజం కనిపించింది. కాంతాన్ని తను చేసుకుంటే తండ్రి వెనక్కి తిరిగి చూడకుండా పొమ్మంటాడు. తండ్రి వాత్సల్యాన్ని-ధనాన్ని త్యాగంచేసే శక్తి తనకు లేదు. బుచ్చిమీద తన అభిప్రాయాలు రుద్దటం ఏం సమంజసంగా వుంది? "నేనైతే మా నాన్నతో కురుక్షేత్ర యుద్ధం చెయ్యాలి. నీ కెవరూ లేరు. నీమాటే ప్రధానం. ఉద్యోగం చేస్తున్నావు. నీకేం లోటు?" బుచ్చి నవ్వుతూ అంగీకారంగా తలూచాడు.

పెళ్ళి చిటికెలో జరిగిపోయింది. వారం రోజులు గడిచాక బుచ్చి కాంతాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ వేళ కామయ్య నవ్వినంత తృప్తిగా ఏనాడూ నవ్వలేదు.

ఆరు నెలలు గడిచాక బుచ్చి కాంతాన్ని తీసుకుని తిరిగివచ్చాడు. గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. కాంతం నల్లబడింది. కళ్ళు లోతుకుపోయాయ్. కళ్ళల్లో చిలిపితనం అంతరించి భయం గూడుకట్టుకుంది. బుచ్చి కళ్ళల్లో విషాదాన్నే కురిపించాడు.

గంట గడిచాక అతను గోపాలందగ్గరకు వచ్చాడు. ఏదో వైపరీత్యం జరిగుంటుందనుకుంటూ గోపాలం అతన్ని పలకరించి "ఇంత హఠాత్తుగా దిగావేరా? ... బాగా చిక్కిపోయావ్" అన్నాడు. "ఉద్యోగం ఊడిపోయిందిరా ... కొంచెం కళ్లు మూసుకుపోయి ప్రవర్తించాను. ఎవరితోనూ అనమోక-లంచం పుచ్చుకున్నాను. ఎలాగో తెలిసిపోయింది. అంతే ఆఖరైంది మన బతుకు - గవర్నమెంటు జాబు-ఏదేదో జరిగిపోయింది... ప్రస్తుతం బికారిని... ఇందులో తప్పంతా నాది కాదులే. మా మేనేజరు నాలుగైదుసార్లు కాంతాన్ని చూశాడు...సరేలే. అవన్నీ ఎందుకు? ఇద్దరం ఎంతకాలం బాధపడతామని దాన్నిక్కడ వదిలేసి నేనుద్యోగ ప్రయ

Firestone



నేడు-ఉత్తమమైనది
రేపు-ఉత్తమోత్తమమైనది

త్నంమీద పోతున్నా. దొరగ్గానే వచ్చి తీసుకుపోతాను."

గోపాలం అయోమయంగా చూస్తూ "మీ మావయ్యకేదే భూముండాలిగా. నీకు సాయం చేయడూ?" అనడిగాడు.

బుచ్చి నవ్వాడు. "అతను పోయి రెండు నెలలైంది. ఆ స్తంతా పెళ్ళాం పేరనే వుంచాడు. ఆ ఛాయలకే వెళ్ళలేదు!"

"గట్టిగా ప్రయత్నం చెయ్. దొరక్కపోదు" అని గోపాలం వుచితంగా సలహాయిచ్చి తన పెట్టెలోంచి తీసి యాభైరూపాలిచ్చాడు. బుచ్చి నోటితో వద్దంటూ చేత్తో పుచ్చుకున్నాడు. మర్నాడే వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక కామయ్య వచ్చి "ఏమంటున్నాడు?" అని కంపిత స్వరంతో అడిగాడు.

"ఉద్యోగం పోయిందట-మళ్ళీ సంపాదిస్తాడు లెండి. ఘటికుడే మరేం భయపడకండి" అన్నాడు.

కాని బుచ్చిమాత్రం తిరిగిరాలేదు. కామయ్య మూడు నెలలాగాడు. అతను కాని కాంతం కాని రాసినవుత్తరాలకు జవాబేవచ్చేదికాదు. గోపాలానికి దిగులు చక్రవడ్డీలా పెరిగింది. ఒకవేళ బుచ్చి తిరిగిరాడేమో! తను అతన్ని బలవంతంగా ఈ పెళ్ళికిఒప్పించకపోతే కాంతం బాగుండేదేమో!

చివరకి కామయ్య, గోపాలం బయలుదేరి వెళ్ళారు. ఎంత వెదికినా బుచ్చికనిపించలేదు. అతనుండిన ఇంటియజమాని అతను వూళ్ళోంచి వెళ్ళిపోయి నెలపైచిలుకయిందన్నాడు. మరో విచిత్రంకూడా చెప్పాడు. బుచ్చి బట్టల దుకాణంలో గుమాస్తాగాచేరి షావుకారులేని సమయంలో కొంతసరుకు రహస్యంగా తీసుకుపోటానికి ప్రయత్నించాడట. చివరికి నలుగురిచేత చీవాట్లుతిని వూరు విడిచి వెళ్ళిపోయాడట. గోపాలం గుండెల్లో ద్రవంగావున్న భయం గడ్డ కట్టుకుపోయింది.

ఎన్నోసార్లు చీకట్లో పెరట్లో ఒంటరిగా కూర్చుని కాంతం ఏడవటం గోపాలం కిటికీలోంచి చూశాడు. అతని కళ్లల్లోకూడా నీళ్ళు నిండేవి. బుచ్చిని ఎన్నోసార్లు తిట్టుకున్నాడు. కానవన్నీ గాలి కెగిరిపోయాయ్-బుచ్చి మాత్రం తిరిగి రాలేదు.

"అయితే కాంతానికి ఆడపిల్లటగా?" అనడిగాడున్నట్టుండి బుచ్చి. అవునన్నట్టు తలూపాడు గోపాలం. అతని కళ్ళల్లో వున్నట్టుండి జీవం మెరిసింది. అలసట తీర్చుకోటానికి బండి ఆగింది. బుచ్చి ఓ మల్లెదండకొని వాసనపీలుస్తూ "ఇవంటే కాంతానికి చాలా యిష్టం సుమా-కాని వందసార్లడిగితేనే కాని కొనిచ్చేవాణ్ణి కాను" అన్నాడు. గోపాలం అదంతా నటననుకున్నాడు.

చీకటిని చీల్చుకుంటూ బండి పరుగెడుతోంది.

"బుచ్చీ నువ్వు కనుక తిరిగి రాకపోతే కాంతం చచ్చిపోతుంది సుమా. ఇప్పటికే రెండు మూడుసారులు మందుతాగింది. విరుగుడిచ్చి ఏదో బతికించారు. మనసును విరక్కొట్టేశావు. ఆపిల్ల కోసమైనా రావాలి."

"కాంతం అలాంటిది కాదురా, ఒకవేళ నేను చస్తే మళ్ళుపెళ్ళి చేసుకోగలదుకూడా అంత ధైర్యంగా వుంది." అని నవ్వాడు బుచ్చి. అతని మాటల్ని, నవ్వుని అర్థం చేసుకోలేక బాధపడ్డాడు గోపాలం.

గోపాలం చిన్నకునుకు తీసి లేచాక వాచీ చూసుకున్నాడు. పన్నెండైంది. తలెత్తి చూసేసరికి బుచ్చి లేడు. చుట్టూచూశాడు. ముసలాడు మాత్రం కునికిపాట్లు పడుతున్నాడు. గుండె చెవుల దగ్గర కొచ్చేసి కొట్టుకుంటోంది.

"తాతా...ఇక్కడున్నతనేడీ?" అనడిగాడు.

"ఏం బాబూ!...ఆయన ఈ రాంపురంలో దిగిపోయారే... ఆయనకు పెళ్లాం మీద అనుమానముండేది?" ముసలాడు నిద్రలోంచిఅన్నాడు

గోపాలం ముసలాణ్ణి ఆశ్చర్యంగా చూస్తూ బుచ్చి అన్న అర్థంలేని మాటలకి అర్థంకోసం ఆలోచింప సాగాడు. మేనేజరు నాలుగైదుసారులు చూడటం- మళ్ళీమళ్ళీ చేసుకునే ధైర్యం ముందటం తలాతోకాలేని మాటల్లాగున్నాయి.

"ఛ...కాంతం చాలా మంచిది. వీడు వట్టి ఎస్కేపిస్ట్. పెళ్ళాన్ని పోషించలేక అలాగంటున్నాడు." అని మనసును ఒప్పించడానికి ప్రయత్నించాడు.

ఇంజను భయంకరంగా కూసింది. ★